# ఉత్తమాశ్వం

అరేబియా దేశమును ఖలీఫా పరిపాలించు రోజులవి. ఆ మహారాజునకు అశ్వము లనిన మహాప్రీతి. ఎంతెంతో ఖరీదు పెట్టి ఎన్నెన్నో ఉత్తమాశ్వములను అనేక దేశములనుండి తెప్పించుచుండెడివాడు. ఒకనాడు అబ్దుల్ కరీముఅను అశ్వవర్తకుడు వచ్చెను. రాజు వచ్చిన కారణమేమని అడిగెను. "నా పేరు అబ్దుల్ కరీము. నేను గుఱ్ఱాల వర్తకుడను. ఒక చక్కటి అరేబియా గుఱ్ఱమును తెచ్చితిని. దానితో వేగముగా బోవు గుఱ్ఱములు అరేబియాలో లేవు. ఈ గుఱ్ఱమును మీరు కొందురను ఉద్దేశ్యముతో వచ్చితిని. ఆపైన మీ అనుగ్రహము" అని చెప్పెను.

ఖలీఫా దాని కెంత కిచ్చెదవని అడిగెను. "తమరు దయాళువులు. ఆ గుఱ్ఱము లక్ష రూప్యములు చేస్తుంది హుజూర్" అనెను. ఖలీఫా సందేహిస్తూ "మే మింతవఱకూ ఏ గుఱ్ఱానికి 50 వేలు మించిపెట్టలేదు. ఎంత ఉత్తమాశ్వమైనా లక్ష రూప్యములు ఖరీదు చేస్తుందంటే చాలా ఆశ్చర్యముగా నున్న"దని చెప్పెను. ఖలీఫాకు ఆ గుఱ్ఱమునకు లక్ష రూపాయలు ఇచ్చుటకు మనసొప్పలేదు. అయినా అంతటి చక్కటి గుఱ్ఱమును వదిలిపెట్ట బుద్ధి పుట్టక చివరకు గొణుగుతూ అబ్దుల్ కరీముకు లక్ష రూపాయల మూట ఇచ్చాడు. వర్తకుడు అది అందుకొని ఒక్కదూకున గుఱ్ఱముమీద కెగిరి కళ్లెము పట్టుకొని లాగుటయే తడవుగా గుఱ్ఱము అతివేగముగా పోసాగెను. ఖలీఫా కోపాశ్చర్యములతో నిండి తన 10 మంది పేరెక్కిన రౌతులను పిలిచి కరీమును వెంబడించమని చెప్పెను. ఆ రౌతులు ఒక గంటతరువాత వచ్చి "హుజూర్ మేమెంత ప్రయత్నించినా ఆగుఱ్ఱపు దొంగ దొరకలేదు. పైగా ఒక్క నిమిషంలో అడవులలో మాయమయినాడు" అన్నారు విచారంగా. ఖలీఫా మిక్కుటమగు కోపముతో వెడలిపోయెను. ఆమరునాడు రాజు దర్శనముకొఱకు ఎవరో వచ్చిరి. ద్వారపాలకుడు రాజుతో ఈ విషయము విన్నవించెను. ప్రొద్దుననే ఎవరు వచ్చిరి చెప్మా అని ఆలోచిస్తూ బయటికి వచ్చాడు ఖలీఫా. అక్కడి దృశ్యాన్ని చూసేసరికి రాజుకు అమితాశ్చర్యం వేసింది. "నిన్న వచ్చిన అబ్దుల్ కరీము సుందరాశ్వముపై కూర్చొని ఒక చేతిలో లక్ష రూపాయల మూట పట్టుకొని యుండుట" ఖలీఫా చూచెను. ఖలీఫాను చూడగనే కరీము ఆతనికి సలాముపెట్టి "హుజూర్, ఇప్పటికైనా గ్రహించారా నా అశ్వము యొక్క ఉత్తమ గుణము! నిన్న మీరు నన్ను నిందించారు. మీ రాజ్యములో నున్న గొప్ప అశ్వములు గూడ నన్ను పట్టుకొనలేక పోయినవి. నేను వెనుదిరిగి చూడ మీ అశ్వములలో నొకటి నిన్న క్రిందపడిపోయినది. మిగిలిన అశ్వములు అలసట చెందినవి. కాని నా గుఱ్ఱము ఏమాత్రము అలసట జెందలేదు. ఇప్పటికైనా చెప్పండి మీ ధనము మీకు కావాలా లేక గుఱ్ఱము కావాలా" అనెను. ఖలీఫా అమితానందముతో "గుఱ్ఱము నిచ్చి వెళ్లు! నీకు ఇచ్చిన లక్ష రూప్యములు గాక వేరే మఱియొక లక్ష రూప్యములు బహుమానముగా నిచ్చుచున్నాను" అని చెప్పెను. కరీము 2 లక్షల రూపాయలు తీసుకొని సంతృప్తిగా వెళ్ళిపోయెను.

★

ఎ. వాసుదేవరావు

---

"రామారావుకి అంతజీతం వస్తుందిగదా, ఏం చేస్తాడో అంతా. ఎప్పుడు చూసినా డబ్బు లేదు, డబ్బు లేదు అనే మాట తప్ప మరొకటి లేదు".

"ఏం, నీ కేమన్నా బాకీ ఉన్నాడా?"

"అవ్వు, నేనే బాకీ ఉన్నాను."

---